ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 26 డిసెంబరు 2024

వాలీబాల్ చాంపియన్ బుక్కపట్నం



బుక్కపట్నం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

బుక్కపట్నం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాలలో రెండ్రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో బుక్కపట్నం జట్టు చాంపియన్‌గా అవతరించింది. ఉమ్మడి జిల్లాతోపాటు కర్ణాటక నుంచి పదుల సంఖ్యలో జట్లు పాల్గొన్నాయి. బుధవారం నిర్వహించిన ఫైనల్లో బుక్కపట్నం, పుట్టపర్తి జట్లు తలపడ్డాయి. 2-0 తేడాతో బుక్కపట్నం గెలుపొందింది. కోలార్ జట్టు మూడోస్థానంలో నిలిచింది. విజేత బుక్కపట్నం జట్టుకు ట్రోఫీతోపాటు రూ.30వేల నగదు, పుట్టపర్తి జట్టుకు రూ.20వేలు, కోలార్ టీంకి రూ.10వేలు నగదు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మీరాజు, టీడీపీ నాయకులు రామలక్ష్మణ్, సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.

శవంతో ధర్నా

రోడ్డుపై మూడు గంటలపాటు బైఠాయింపు
పోలీసుల తీరుపై విమర్శలు
- వివరాలు 7లో...



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

సెమీస్‌కు మహారాష్ట్ర

సుస్మత్ సావంత్, నిఖిల్ లునావత్ సెంచరీలు
ఆంధ్ర జట్టు ఇంటిముఖం
రోజంతా వికెట్ తీయలేకపోయిన బౌలర్లు
- వివరాలు 7లో...



మహారాష్ట్ర జట్టు

ఘనంగా క్రిస్మస్

చర్చిల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు.. కేక్ కట్‌చేసి సంబరాలు..



ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఆర్జే రత్నాకర్, చక్రవర్తి

ప్రశాంతి నిలయంలో..

పుట్టపర్తి: స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదట సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. విద్యార్థుల వేదపఠనంతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి.. విదేశీభక్తులతో కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం విదేశీభక్తులు క్రిస్మస్ క్యారల్స్‌ను ఆలపించారు. గంట పాటు పాశ్చాత్య సంగీతంతో అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా సాయికుల్వంత్ మందిరాన్ని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేడుకల్లో దేశ విదేశాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



అలంకరణలో సత్యసాయి మహాసమాధి



ప్రశాంతి నిలయంలో శాంతాక్లాజ్ సందడి



హిందూపురంలోని విద్యానగర్ చర్చిలో శాంతి సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ డేవిడ్

హిందూపురం అర్బన్: జిల్లావ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా చేసుకున్నారు. యేసు ప్రభువు చూపిన శాంతి మార్గంలో ప్రజలందరూ పయనించాలని పాస్టర్లు పిలుపునిచ్చారు. పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం చర్చిలకు పెద్దఎత్తున క్రైస్తవులు చేరుకున్నారు. పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాస్టర్లు సందేశమిచ్చారు. పాస్టర్లు మాట్లాడుతూ.. విశ్వశాంతి కోసం యేసు తపన పడ్డారన్నారు. యేసు చూపిన శాంతి మార్గంలోనే ప్రతి ఒక్కరూ పయనించాలని సూచించారు. అనంతరం చర్చిల్లో కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కీర్తనలు, పాటలతో అలరించారు. సాయంత్రం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కొవ్వొత్తులు వెలిగించి, యేసును ప్రార్థించారు.



సీఎస్‌ఐ మిషన్ కాంపౌండ్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

అతిక్రమిస్తే.. బాదుడే.

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు
- హెల్మెట్ పెట్టుకోకుంటే అంతే..
- డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే రూ.10 వేలు కట్టాల్సిందే..



హిందూపురం అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ బాదుడు తప్పదు. రోడ్డు ప్రమాదాల నివారణ దిశగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రణాళిక రూపొందించింది. నిబంధనలు పాతవే అయినా.. జరిమానాలు భారీగా విధించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. పోలీసులు, రవాణాశాఖ అధికారులకు ఇదే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. గతంలో రవాణాశాఖ, పోలీసులకు వేర్వేరు యాప్‌లు ఉండేవి. అందులో పోలీసులకు ఏదో ఒక దానిపైనే జరిమానా విధించే అవకాశం ఉండేది. నూతన యాప్‌లో అన్ని రకాల జరిమానాలను ఏకకాలంలో రవాణా శాఖాధికారులతోపాటుగా పోలీసులు కూడా విధించవచ్చు. ఇరు శాఖల అధికారులు ఒకే యాప్ ద్వారా జరిమానాలు విధిస్తారు. దీంతో టార్గెట్లు పూర్తి కావడమే కాకుండా నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలు తప్పవు. అన్నిటినీ పరిశీలించి ఏకకాలంలో రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశాలున్నాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోతే జేబులు ఖాళీ కావడం తథ్యం. కఠిన శిక్షలు కూడా విధిస్తారు.

ట్రాఫిక్ ఉల్లంఘనపై జరిమానాల వివరాలిలా ఉన్నాయి..

ఉల్లంఘన	పాత జరిమానా	నూతన జరిమానా
రెడ్‌లైట్ ఉల్లంఘిస్తే..	రూ.100	రూ.500
లైసెన్సు లేకపోతే	రూ.500	రూ.5వేలు
అతివేగం	రూ.400	రూ.వెయ్యి
ర్యాష్ డ్రైవింగ్	రూ.1000	రూ.5వేలు
డ్రంక్ అండ్ డ్రైవ్	రూ.2వేలు	రూ.10వేలు
రేసింగ్	రూ.500	రూ.5వేలు
హెల్మెట్ లేకపోతే	రూ.100	రూ.వెయ్యి, మూడు నెలలు లైసెన్సు రద్దు
సీటు బెల్టు పెట్టుకోకుంటే..	రూ.100	రూ.వెయ్యి
అత్యవసర వాహనాలను అడ్డుకుంటే	0	రూ.10వేలు
బైక్‌పై త్రిబుల్ రైడింగ్	0	రూ.1200
బైక్‌పై ఓవర్ లోడ్	రూ.100	రూ.2వేలు మూడు నెలలు లైసెన్సు రద్దు
ఇన్సూరెన్స్ లేకపోతే	రూ.వెయ్యి	రూ.2వేలు

నిబంధనలు పాటించాల్సిందే...

ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. వాటిని పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయి. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

-కరుణసాగర్‌రెడ్డి, ఆర్టీఓ, హిందూపురం



ఊరించే విషం..!

రంగురంగుల కేక్‌లు.. అనారోగ్య కారకాలు..

- తింటే రోగాలు ఖాయం
- విచ్చలవిడిగా విక్రయాలు
- తూతూమంత్రంగా ఆహార భద్రత శాఖాధికారుల తనిఖీలు

హిందూపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కేక్ ట్రెండ్ నడుస్తోంది. పండగైనా, పుట్టిన రోజైనా, పెళ్లయినా, వార్షికోత్సవమైనా, విజయోత్సవమైనా, ఏదేని వస్తువు, యంత్రం, వాహనం కొనుగోలు చేసినా మొదట కేక్ కట్‌చేయడం ఆనవాయితీగా మారింది. ఈ పరిస్థితుల్లో వినియోగదారులను ఆకర్షించేందుకు ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు కలపడం కూడా ఇటీవల అధికమైంది. వాటిని తింటే మధుమేహం, బీపీతోపాటు ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కల్తీ, ప్రమాదకర ఆహారం నుంచి ప్రజలను రక్షించడానికి ఎన్నో చట్టాలు ఉన్నాయి. అధికారులు మాత్రం వాటిని అమలు చేయట్లేదు. కొంతమంది వ్యాపారుల స్వార్థం, మరికొంతమందికి అవగాహన లేకకృత్రిమరంగులు కలిపిన ఆహార పదార్థాలను తయారుచేసి, విక్రయిస్తున్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. కేక్‌లలో రంగులు అధికంగా కలుపుతున్నట్లు తెలుస్తోంది.

క్రిస్మస్ నుంచి సంక్రాంతి వరకు..

ఇతర పండుగలతో పోలిస్తే క్రిస్మస్‌కు కేక్‌ల విక్రయాలు భారీగా సాగుతాయి. ప్రతిచోటా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తారు. రోజూ కేక్ కటింగ్‌లు ఉంటాయి. జనవరి 1వ తేదీ వరకు కేక్‌లు భారీ ఎత్తున అమ్ముడవుతాయి. జనవరి 2వ వారంలో వచ్చే సంక్రాంతి సందర్భంగా స్వీట్లు, కేక్‌లు భారీఎత్తున అమ్ముడుపోతాయి. ఏడాది మొత్తంగా క్రిస్మస్ నుంచి జనవరి మొదటివారంలో జరిగే వ్యాపారమే అధికంగా ఉంటుంది. జనవరి 1ని కులమతాలకు అతీతంగా డిసెంబరు 31 రాత్రి నుంచే కేక్‌లు కట్‌చేసి, స్వీట్లు పంచుకుంటారు. రోడ్లపైన బల్లలు పెట్టి, పందిళ్లు వేసి కేక్‌లు కట్ చేస్తారు. అలా ఒక్కరోజులోనే కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తారు. చాలా మంది వ్యాపారులు స్వలాభం కోసం వినియోగదారుల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వం నిషేధించిన రంగులను కేక్‌లు, స్వీట్ల తయారీలో వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అద్దాల మేడలో అందమైన విషం

ఇటీవల కార్పొరేట్ స్థాయిలో అద్దాల మేడలుగా ఏర్పాటుచేసి అందులో రంగురంగుల కేక్‌లు నిలువ ఉంచుతున్నారు. కొన్నాళ్ల క్రితం వరకు స్థానికులు బేకరీలు నిర్వహించేవారు. కొంతమంది కార్పొరేట్ స్థాయిలో పట్టణాల్లో భారీఎత్తున బేకరీలు ఏర్పాటుచేసి, అద్దాల నీడలో కేక్‌లను ఉంచుతూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. అక్కడ చూస్తే ఎవరైనా కేక్ కొనాలనిపిస్తుంది. వాటిలో వారం పదిరోజులుగా నిలువ ఉంచినవి కూడా ఉంటున్నాయని జనం వాపోతున్నారు. ప్రజలకు తెలియకుండా అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారని వైద్యులు అంటున్నారు. జిల్లాలో స్వీట్లు, కేక్‌లు తయారు చేసే షాపులు వందల్లో ఉన్నాయి.

వీటిలో నిత్యం లక్షలాది రూపాయల వ్యాపారం సాగుతోంది. కొన్నిరకాల బ్రాండ్ల పేరుతో ఉన్న షాపుల్లో ఇతర ప్రాంతాల నుంచి స్వీట్లు దిగుమతి చేసుకుని, విక్రయిస్తుంటారు. కేక్‌లు, స్వీట్లు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్త వహించాలి. వాటిని పరిశీలించి, తీసుకోవాలి. లేదంటే అనారోగ్యం బారిన పడక తప్పదు.

నిబంధనల అమలు అంతంతే..

స్వీటు షాపు నిర్వాహకులు ఎక్కువ మంది ఫుడ్‌లైసెన్స్ తీసుకోకుండా చాటుమాటున అమ్మకాలు చేస్తుంటారు. కేక్‌లు, స్వీట్లు, కవర్లు, బాక్సులపై వాటి



తయారు తేదీ, గడువుతీరే తేదీ కచ్చితంగా ముద్రించాలి. స్వీట్లు కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు నాణ్యతాప్రమాణాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలి. చాలాచోట్ల కేక్‌లు, స్వీట్ల తయారీలో అనుమతులులేని రంగులు వాడుతున్నట్లు తెలుస్తోంది. ఆహార భద్రతాధికారులు తూతూమంత్రంగా దాడులు చేస్తూ అడపాదడపా కేసులు నమోదు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

నిషేధిత రంగులు వాడితే చర్యలు

కేక్‌లు, స్వీట్ల తయారీలో నిషేధిత రంగులు వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆహార పదార్థాలు తయారుచేసే సంస్థలు, హోల్‌సేల్, రీటైల్‌గా అమ్మేవారు తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలి. ప్రజారోగ్యానికి ఇబ్బంది కలిగించే రంగులు వాడితే వారిపై కేసులు నమోదుచేసి, జరిమానాలు విధిస్తాం.

- తస్లీం, ఆహారభద్రత అధికారి




పెళ్లి పీటలపై కొలువుదీరిన శ్రీవారు, అమ్మవార్లు

వైభవంగా ఖాద్రీశుడి

కల్యాణోత్సవం

కదిరి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు. పలు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవం చేశారు. శ్రీవారికి కల్యాణ కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, పార్థసారధి ఆచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైకుంఠసమారాధన



పూజ్యులు
శ్రీ ఎ.వి.సుబ్బయ్య నాయుడు
గారు 18-12-2024 నాడు పరమ
పదించినారు. దైవ సన్నిధిలో వారి
ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతున్ని ప్రార్థిస్తూ....
భార్య:ఎ.నవరత్నమ్మ
కుమారులు, కోడళ్ళు
కూతురు, అల్లుడు మరియు
మనవళ్లు, మనవరాళ్లు
కీ॥శే ఎ.వి.సుబ్బయ్య నాయుడు
రిటైర్డ్ మండల విద్యాశాఖాధికారి, తాడిపత్రి.
మరణం:18-12-2024
వైకుంఠసమారాధన: 28-12-2024 వ తేది శనివారం తాడిపత్రి పట్టణం
క్రిష్ణాపురం 5 వ రోడ్డులోని మా స్వగృహం నందు మధ్యాహ్నం 12:00 గంటలకు జరుగును.

రోడ్డుపై ధాన్యం..!

కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది కొరత

సంచులను సమకూర్చని అధికారులు

మూడు కేంద్రాల పర్యవేక్షణకు ఒక్కరే..!

ప్రభుత్వం చొరవ చూపినా..

క్షేత్రస్థాయిలో వైఫల్యం



కణేకల్లు సమీపంలో ఆరబోసిన వరిధాన్యం

రాయదుర్గం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువకాలువ కింద ఖరీఫ్‌లో పండించిన వరిధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నా, అధికారులు సరైన ప్రణాళికను అమలు చేయడం లేదు. దీంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగలేక తక్కువ ధరకే దళారులకు అమ్మి నష్టపోతున్నారు. మరోవైపు సిబ్బంది కొరత, ఖాళీ సంచుల లోటు వేధిస్తున్నాయి. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో 28 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగైంది. వరి ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేందుకు కణేకల్లు, ఉద్దేహాళ్, శ్రీధరఘట్టలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. పౌర సరఫరాల శాఖ నిర్దేశించుకున్న ఐదువేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ఇప్పటికే పూర్తి అయింది. అదనంగా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ కొనుగోలు చేసేందుకు తగినంత సిబ్బందిని అధికారులు నియమించలేదు. ఈ-క్రాప్ బుకింగ్‌లో వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది.

మూడు కేంద్రాలకు ఒక్కరే..

ధాన్యం కొనుగోలు చేయడానికి మూడు కేంద్రాలకు ఒక్కరినే నియమించారు. ధాన్యం కొనుగోలు బాధ్యతను ఎఫ్‌పీసీఎస్, పీఏసీఎస్‌కు అప్పగించారు. వారు డిమాండ్‌ను బట్టి సిబ్బందిని నియమించుకోవాలి. సిబ్బందికి పౌరసరఫరాల శాఖ శిక్షణ ఇస్తుంది. కానీ ఆ దిశగా చర్యలు లేవు. సమన్వయం లోపించడంతో సమస్య తలెత్తింది. కొనుగోలు చేసిన వెంటనే ప్రభుత్వం డబ్బులు ఇస్తోందని, కానీ అధికారుల నిర్లక్ష్యంతో తాము నష్టపోతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సంచుల కొరత

కొనుగోలు కేంద్రాలలో రైతులకు తగినన్ని సంచులను మిల్లర్లు సమకూర్చడం లేదు. ఆన్‌లైన్‌లో 45 కిలోల బస్తాకు మాత్రమే అనుమతి ఉంది. ఆ సంచులను సరఫరా చేయడం లేదు. కొందరు మిల్లర్లు 75 కిలోల ఖాళీ సంచులను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నా, అధికారులు అనుమతించడం లేదు. ఆన్‌లైన్ సాకును చూపి కాలయాపన చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం శాంపిల్స్‌ను తీసువచ్చి.. పరిశీలన అధికారుల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

చలిలో కాపలా

హెచ్చెల్సీ ఆయకట్టులో నవంబరు చివరివారం నుంచే వరి కోతలు మొదలయ్యాయి. యంత్రాల కొరతతో కొన్నిచోట్ల జాప్యం జరిగింది. డిసెంబరు చివరి వారంలో ఊపందుకుంది. ఆయకట్టులో ఎక్కడ చూసినా ధాన్యం కుప్పలు కనిపిస్తున్నాయి. చలిలో రాత్రిళ్లు కాపలా కాస్తూ ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలకు తరలించి, అమ్మాలని రైతులు ప్రయత్నిస్తున్నా.. అధికారుల తీరుతో సాధ్యం కావడం లేదు. దీంతో ఓపిక నశించి, రైతులు తక్కువ ధరకే దళారులకు అమ్ముతున్నారు. కొనుగోలు కేంద్రాలలో క్వింటానికి గ్రేడ్ వన్ రకం రూ.2,320, సాధారణ రకం రూ.2300 ధర ఇస్తున్నారు. మార్కెట్‌లో రూ.2100 ప్రకారం దళారులు కొంటున్నారు. పైగా డబ్బులు చెల్లించేందుకు నెల రోజుల సమయం తీసుకుంటున్నారు.

ఎదురు చూస్తున్నా..



రెండున్నర ఎకరాలలో వరి పంటను 15 రోజుల క్రితం కోతకోసి ధాన్యాన్ని రోడ్‌లో వేసుకున్నాను. కొనుగోలు కేంద్ర అధికారుల కోసం ఎదురుచూస్తున్నాను. రేపు, మాపు అంటూ కాలాయాపన చేస్తున్నారు. ప్రతి రోజూ ఎండ బెండుతున్నాను. ధాన్యం బాగా ఎండిపోయింది. అధికారులు వెంటనే కొనుగోలు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- రహిమాన్‌ఖాన్, కణేకల్లు

ఖాళీ సంచులు లేవు..



అంబాపురం వద్ద పదెకరాలలో వరి కోత కోసి విక్రయానికి సిద్ధంగా ఉంచాను. ప్రభుత్వం కొనుగోలు చేస్తుందేమోనన్న ఆశతో కణేకల్లు ఆదర్శ భారతి సొసైటీలో పేరు నమోదు చేసుకున్నాను. ఈ నెల 18వ తేదీ నుంచి ఖాళీ సంచుల కోసం తిరుగుతున్నాను. ఇప్పటికీ ఇవ్వలేదు. అధికారులు వెంటనే స్పందించాలి.

- స్వాములు, రైతు, అంబాపురం

టార్గెట్ పెంచి సిబ్బందిని నియమిస్తాం

ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసిన మూడు కేంద్రాలను ఒక్కరే పర్యవేక్షిస్తున్నారు. అదనపు సిబ్బంది నియమించేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరాము. త్వరలో నియమిస్తారు. ఖాళీ సంచుల కొరత తలెత్తకుండా ఎప్పటికపుడు సరఫరా చేస్తున్నాం. సహకార సంఘాలు తగినంత సిబ్బందిని నియమించుకోలేదు. పర్యవేక్షించి, సిబ్బందిని నియమిస్తాం. ఐదు వేల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. టార్గెట్ ఇప్పటికే పూర్తి కావస్తోంది. అదనపు కొనుగోలుకు ప్రభుత్వం అనుమతించింది. టార్గెట్‌ను పెంచుకుని రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం. మిల్లర్లతో కూడా చర్చించి సంచుల కొరత లేకుండా చూస్తాం.

- రమేష్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల శాఖ

మార్కెట్‌లో అమ్మేశా..



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరిగే ఓపికలేక పది రోజుల క్రితమే మార్కెట్‌లో అమ్మేశాను. ప్రభుత్వం క్వింటానికి రూ.2320 ఇస్తోందని తెలిసి అధికారుల చుట్టూ తిరిగాను. కార్యాలయాల చుట్టూ తిరిగాను. ఖాళీ సంచులు ఇవ్వలేదు. బతిమాలినా పట్టించుకోలేదు. అందుకే నష్టానికి అమ్ముకున్నాను.

- రాము, గంగలాపురం

జోరుగా ఇసుక దందా

పట్టించుకునే నాథుడే లేడు

కొందరు అధికారులకు ముడుపులు

బొమ్మనహాళ్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉచితం ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఇది కొందరు అక్రమార్కులకు వరంగా మారింది. మండలంలోని కల్లుదేవనహళ్లి వేదావతి హగరి నుంచి ట్రాక్టర్లలో ఇసుకను పట్టపగలే తవ్వుకుని దర్జాగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉరవకొండ, గుంతకల్లు, విడపనకల్లు ప్రాంతాలకు నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. తోడుకున్నోళ్లకు తోడుకున్నంత అన్నరీతిలో ఇక్కడి నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక దందాలో కొందరు అధికారులకు ముడుపులు అందుతున్న కారణంగా పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



కల్లుదేవనహళ్లి వద్ద వేదవతి హగరి నదిలో ఇసుక తవ్వకాలు ఇలా..

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ఇసుకను అక్రమంగా వేదావతి హగరి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పనుల ఉపయోగానికి అనుమతి తీసుకుని ఇసుకను తరలించుకోవాలి. ఇతర ప్రాంతాలకు తరలించినట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై పటిష్ఠ నిఘా పెట్టి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసులు నమోదు చేయిస్తాం.

- మునివేలు, తహసీల్దార్

శవంతో ధర్నా

రోడ్డుపై మూడు గంటలపాటు బైఠాయింపు

పోలీసుల తీరుపై విమర్శలు



రోడ్డుపై శవంతో ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

గోరంట్ల, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): మండంలోని హిందూపురం ప్రధాన రహదారిపై గుమ్మయ్యగారిపల్లి సమీపాన ఫంక్షన్‌హాల్ వద్ద మల్లాపల్లి వాసులు బుధవారం శవంతో ధర్నాకి దిగారు. మూడుగంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. పెద్దఎత్తున పోలీసులు అక్కడికి చేరుకుని, ట్రాఫిక్‌ను మళ్లించారు. మల్లాపల్లికి చెందిన టీడీపీ నాయకుడు స్టోర్ డీలర్ శ్రీధర్ భూవివాదం కారణంగా ఈనెల 9న సెల్ఫీ వీడియో తీసి, ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతూ అతడు బెంగళూరు ఆస్పత్రిలో మృతిచెందాడు. గోరంట్ల పోలీసులు భూవివాదానికి కారకులైన ఏడుగురితోపాటు ఇతరులపై కేసు నమోదు చేసి, సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నిందితుడైన మల్లాపల్లికి చెందిన పెయ్యాల వెంకటరెడ్డి (55).. పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతో పదిరోజులుగా కర్ణాటకలోని కోడిపల్లిలో బంధువుల ఇంట్లో తలదాచుకున్నాడు. ఈ నేపథ్యంలో అతడు ఈనెల 23న గుండెపోటుతో మృతిచెందాడు. మంగళవారం రాత్రి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. బుధవారం ఉదయం వెంకటరెడ్డి మృతదేహంతో కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున గోరంట్ల పోలీసు స్టేషన్ ముందు ఆందోళన తలపెట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారికి ఎదురెళ్లి గుమ్మయ్యగారిపల్లి వద్ద అడ్డగించారు. దీంతో అక్కడే వారు రోడ్డుపై శవాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. శ్రీధర్ ఆత్మహత్య కేసులో అతడి సెల్ఫీ వీడియో వాంగ్మూలం మేరకు కాకుండా కొంత మంది పేర్లు తొలగించి, తమను అక్రమంగా ఇరికించారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసుల వేధింపుల కారణంగానే వెంకటరెడ్డి మృతిచెందినట్లు ఆరోపించారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో పెనుకొండ, ధర్మవరం డీఎస్పీలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, గోరంట్ల, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి సీఐలు శేఖర్, రాఘవన్, రాగిరి రామయ్య, సునీత, సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు పెద్దఎత్తున పోలీసు బలగాలు అక్కడికి చేరుకున్నాయి. బాధితులతో అధికారులు చర్చించినా వారు ససేమిరా అన్నారు. న్యాయం చేస్తామని డీఎస్పీలు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఉదయం 7.15 నుంచి 10.15 గంటల వరకు ఆందోళన కొనసాగింది. గోరంట్ల సీఐ శేఖర్ మాట్లాడుతూ.. కర్ణాటకలోని కోడిపల్లిలో తలదాచుకున్న వెంకటరెడ్డి 23న సాయంత్రం వాకింగ్‌కు వెళ్లి కింద పడిపోయి మృతిచెందాడన్నారు. పోలీసుల కేసు కారణంగా కర్ణాటకలో ఉంటున్న ఆయన మృతిచెందినట్లు గౌరీబిదనూర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, పోస్టుమార్టం నిర్వహించి పంపినట్లు సీఐ వివరించారు. వెంకటరెడ్డి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు విచారణ చేపడతామని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

సెమీస్‌కు మహారాష్ట్ర.. ఇంటికి ఆంధ్రా

డ్రాగా ముగిసిన మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆధిక్యంలో కొనసాగుతూ వచ్చిన మహారాష్ట్ర సెమీస్‌కు అర్హత సాధించగా....అన్ని విభాగాల్లో చేతులెత్తేసిన ఆంధ్రా ఇంటి ముఖం పట్టింది. బీసీసీఐ కూచ్ బెహార్ అండర్-19 ట్రోఫీ ఆంధ్రా-మహారాష్ట్ర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆర్డీటీ స్టేడియంలో బుధవారం నాలుగో రోజు ముగిసింది. ఓవర్‌నైట్ స్కోర్ 173-3గా నాలుగో రోజు ఆటను ఆరంభించిన మహారాష్ట్ర వికెట్ నష్టపోకుండా 116.3 ఓవర్లలో 305 పరుగులు చేసింది. బ్యాటర్లు సుస్పత్‌సావంత్ (117), నిఖిల్ లునావత్ (100)లు 211 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆధిక్యంలో కొనసాగిన మహారాష్ట్ర జట్టు సెమీ ఫైనల్‌కు క్వాలిఫై అయ్యింది.



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సుభంకాదం

దీంతో ఈనెల 30వతేదీ నుంచి చెన్నైలో తమిళనాడుతో మహారాష్ట్ర సెమీస్ ఆడనుంది. ఇదిలా ఉంటే...మహారాష్ట్ర మొదటి ఇన్నింగ్స్‌లో 420 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మొదటి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన సుస్పత్ సావంత్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ చేశాడు. మరో బ్యాటర్ కిరణ్ చోర్మోలే సెంచరీ చేసి జట్టుకు భారీ స్కోర్ అందించారు. ఆంధ్రా మొదటి ఇన్నింగ్స్‌లో మహారాష్ట్ర బౌలర్ల ధాటికి 143 పరుగులకే కుప్పకూలింది. మహారాష్ట్ర స్పిన్నర్ సుభంకాదం 6వికెట్లు తీశారు. ఇక చివరి రోజు మహారాష్ట్ర బ్యాటర్లు సుస్పత్ సావంత్, నిఖిల్ లునావత్ వికెట్ నష్టపోకుండా క్రీజును అంటిపెట్టుకుని రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను డ్రాగా ముగించి జట్టును సెమీస్‌కు తీసుకెళ్లారు. అటు బ్యాటింగ్‌లోనూ...ఇటు బౌలింగ్‌లోనూ విఫలమైన ఆంధ్రా జట్టు ఇంటి ముఖం పట్టింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా సుభంకాదమ్ నిలిచారు. కార్యక్రమంలో బీసీసీఐ సెలెక్టర్ హర్వీందర్‌సింగ్ సోధి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్, మహారాష్ట్ర సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ మిలింద్‌గుంజాల్, జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మీడియా మేనేజర్ రాజగోపాల్, ఏసీఏ సౌత్‌జోన్ మేనేజర్ సాగర్ చౌదరి, ఎంసీఏ హెడ్‌కోచ్ అజయ్‌చౌహాన్, ఏసీఏ హెడ్‌కోచ్ ప్రదీప్, ఏడీసీఏ కోశాధికారి షబ్బీర్, ఏసీఏ, ఏడీసీఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

ఒకరోజు ముందుగానే...

31న పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు కొత్త సంవత్సరం ఒక రోజు ముందుగానే రానుంది. ఈనెల 31వ తేదీన 2025 సంవత్సరం జనవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు ఈనెల 30న బ్యాంకుల నుంచి సొమ్ము డ్రా చేసుకోవాలని సూచించారు.

జీసీపల్లిలో భారీ కొండచిలువ



పుట్లూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామశివారులోని కొండ ప్రాంతంలో బుధవారం భారీ కొండచిలువను చూసి జనం భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో పశువులను మేపేందుకు వెళ్లారు. అక్కడ మేక పిల్లలను చూసిన కొండచిలువ... వాటిని తినేందుకు ప్రయత్నించగా కాపరులు దానిని వెంబడించారు. దీంతో అరగంటపాటు శ్రమించి కట్టెలతో కొట్టి చంపేశారు. సుమారు 7 అడుగులు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

టమోటా కిలో రూ.11

అనంతపురం రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.11తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,320 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6,500, సరాసరి రూ. 19 వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 38 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నేడు ఫెన్సింగ్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కొవ్వూర్‌నగర్‌లోని విద్యారణ్యపాఠశాల ఆవరణంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, పుష్పావతి తెలిపారు. 2008 జనవరి 1వతేదీ నుంచి 2011 డిసెంబరు 21వతేదీలోపు జన్మించిన బాల, బాలికలు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28, 29వతేదీలలో కాకినాడలో నిర్వహించే 10వ ఏపీ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలని పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



హుస్సేనమ్మ (ఫైల్)

పెనుకొండ రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శతాధిక వృద్ధురాలు హుస్సేనమ్మ(109) బుధవారం అనారోగ్యంతో మరణించారు. హుస్సేనమ్మ రొద్దం పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తూ రిటైరయ్యారు. ఆమె భర్త బాబయ్య 40 ఏళ్ల క్రితమే మరణించారు. హుస్సేనమ్మకు వందేళ్ల దాటినా చలాకీగా ఉండేవారు. ఈ నేపథ్యంలో వృద్ధాప్య సమస్యలు, అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి 15 మంది పిల్లలున్నారు. వారికి పిల్లలు అంటే హుస్సేనమ్మ మునిమనవళ్లు, మనవరాళ్లు 23 మంది ఉన్నారు.

రైలు నుంచి జారిపడ్డ యువతి



గాయపడిన హరిత

బత్తలపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన నాగరాజు కుమార్తె హరిత ట్రైన్‌లో నుంచి జారి పడి తీవ్రంగా గాయపడింది. హరిత కలికిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం తమ్ముడితో కలిసి కలికిరి నుంచి గుంతకల్లుకు ట్రైన్‌లో బయలుదేరింది. మండలంలోని డి చెర్లోపల్లి సమీపంలో ఆ రైలు వెళ్తుండగా.. వాష్ రూంకు వెళ్లిన ఆ యువతి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడింది. హరిత ఎంతసేపటికీ రాకపోవడంతో ఆమె తమ్ముడు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు హరిత సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆమె లోకేషన్ గుర్తించి ట్రాక్‌మన్ మస్తాన్‌ను అప్రమత్తం చేశారు. అతను ఆ యువతి పడి ఉన్న ప్రదేశానికి వెళ్లి.. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రైల్వే పోలీసులు ఆమెను 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

హత్య కేసులో నలుగురి అరెస్ట్

తాడిపత్రి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లి సమీపంలో ఈనెల 23న అదే గ్రామానికి చెందిన వంశీని హత్యచేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. వంశీ హత్య కేసులో రావివెంకటాపల్లికే చెందిన పెద్దిరాజు, రంగనాయకులు, వెంకటాంపల్లికి చెందిన రవికాంత్, నరసయ్యగారి వెంకటేష్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి కత్తి, గుండురాయి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రావివెంకటాంపల్లికి చెందిన పెద్దిరాజు, రంగనాయకులు ఐషర్ వాహనానికి వెళ్లేవారని, అదే గ్రామానికి చెందిన వంశీ కూడా ఈ వాహనానికి క్లీనర్‌గా వెళ్లేవాడన్నారు. ఈ క్రమంలో క్లీనర్‌గా వెళ్లినందుకు డబ్బులు ఇవ్వకపోవడంతో పెద్దిరాజు, రంగనాయకులును వంశీ కొట్టాడన్నారు. ఈ విషయంలో రంగనాయకులు, పెద్దిరాజుతోపాటు అతని చిన్నాన్న నాగరాజు కుమారుడు రవికాంత్ అలియాస్ రవి, వెంకటేష్ పెద్దిరాజుకు మద్దతుగా నిలిచారన్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న వంశీ రెండువారాల అనంతరం రవికాంత్‌ను కొట్టించి మీరు నన్ను ఏమి చేసుకోలేరని గ్రామంలో చెప్పుకొనేవాడన్నారు. దీంతో నలుగురు వంశీపై కక్షకట్టి ఎలాగైనా హతమార్చాలని పథకం రచించారన్నారు. ఈ క్రమంలో వంశీ గ్రామ సమీపంలోని కంపచెట్లలో ఒంటరిగా మద్యం సేవించడం చూసి కొన్నిరోజులు నలుగురు కలిసి రెక్కీ నిర్వహించారన్నారు. ఈ మేరకు ఈనెల 23న నలుగురు నిందితులు వంశీపై కత్తితో దాడిచేసి అక్కడే ఉన్న బండరాయితో తలపై బాదారన్నారు. దీంతో వంశీ అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. అందిన సమాచారం మేరకు బుధవారం పట్టణ సమీపంలోని ఆటోనగర్ బైపాస్‌రోడ్డులో ఉన్న నలుగురు నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కాపాడేందుకు వెళుతుండగా ఆటో బోల్తా... తండ్రికి తీవ్ర గాయాలు



అభిలేష్ (ఫైల్)

గుమ్మఘట్ట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జె.వెంకటంపల్లిలో బుధవారం ఉదయం విద్యుత్‌షాక్‌తో అభిలేష్(20) అనే యువకుడు మృతి చెందాడు. కాపాడేందుకు ఆటోలో తీసుకెళుతూ మార్గమధ్యంలో బోల్తాపడి తండ్రి శివన్న తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్థులు, కుటుంబసభ్యుల వివరాల మేరకు.. శివన్న ఇల్లు కడుతున్నాడు. ఆయన కుమారుడు అభిలేష్ ఇంటికి నీళ్ల పెడుతుండగా మోటారుకు అమర్చిన వైరు తొలగిపోయింది. దీంతో వైరును సరిచేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. కుమారుడిని కాపాడుకోవాలని ఆసుపత్రికి ఆటోలో తరలిస్తుండగా రాయదుర్గం సమీపంలో అది బోల్తా పడి తండ్రి శివన్న సైతం తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. శివన్నకు భార్య, మరో ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు మరణించడం, తండ్రి ఆస్పత్రి పాలవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. క్రిస్మస్ రోజున ఈ సంఘటన చోటు చేసుకోవడం బాధ కలిగిస్తోందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాదంతో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు.

ఫ్యూజు వేస్తూ రైతు..



శంకర్ (ఫైల్)

గాండ్లపెంట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరుకుంట్లపల్లికి చెందిన రైతు శంకర్ (55) బుధవారం విద్యుదాఘాతంతో మరణించాడు. ఏఎస్‌ఐ రంగా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శంకర్ తనకున్న భూమిలో వరి సాగు చేశాడు. పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఇటీవల వర్షాల కారణంగా ఫ్యూజులు తీసేశారు. ఫ్యూజులు వేస్తుండగా బోరు స్టార్టర్‌కు విద్యుత్ సరఫరా అయి, శంకర్‌కు షాక్ తగిలి, అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కల పొలాల రైతులు గమనించి, కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, శవాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైతు శంకర్‌కు భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. రైతు మృతిపై కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

లారీని ఢీకొని యువకుడు...



బాబాఫక్రుద్దీన్ (ఫైల్)

కదిరి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల వద్ద ఉన్న వై జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడికి గాయాలైనట్లు పట్టణ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. కుటాగుళ్లకు చెందిన బాబాఫక్రుద్దీన్(22), అతడి స్నేహితుడు అతుల్‌ఖాన్ మంగళవారం రాత్రి స్నేహితులతో కలిసి బయటకు వెళ్లారు. ఇద్దరు బుధవారం తెల్లవారుజామున 2 గంటలకు ద్విచక్రవాహనంలో వస్తుండగా.. కదిరి నుంచి అనంతపురం వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాబా ఫక్రుద్దీన్ అక్కడిక్కడే మృతచెందగా, వెనక వైపు కూర్చున్న అతుల్‌ఖాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన చికిత్సల కోసం అనంతపురం తరలించారు. బాబాఫక్రుద్దీన్ ఆటో తొలుకుని జీవనం సాగిస్తున్నాడు. అతడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి సాదిక్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుత్తి వద్ద బేల్దారి..

గుత్తిరూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భాస్కర్ (29) అనే వ్యక్తి మృతి చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. గుత్తి మండలం యంగన్నపల్లికి చెందిన భాస్కర్, లక్ష్మణ్, బాలకృష్ణ ముగ్గురు కలసి బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. తొండపాడు గ్రామంలో రోడ్డు పక్కనే బేల్దారి పని ముగించుకొని ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరారు. కొంచెం ముందుకు వెళ్లిన వెంటనే సెల్‌ఫోన్ మరచిపోవడంతో నడుచుకుంటు పని చేస్తున్న ఇంటిలోకి వెళ్లి తీసుకుని భాస్కర్, లక్ష్మణ్ ఇద్దరు కలసి వస్తుండగా.. లారీ వచ్చి ఢీ కొట్టడంతో భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మణ్ అనే వ్యకికి తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, పిక్కింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647

AJA- 224851

గాయత్రి జ్యోతిష్యం

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర. 9440532926.

AJA-224910

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్..

నేడు రెవెన్యూ సదస్సు

నల్లమాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగంపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రంగనాయకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ పులగంపల్లి సచివాలయం పరిధిలోని ప్రజలు సమస్యలను వినతుల రూపంలో ఇవ్వాలని, వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు.

రక్తదానంపై అవగాహన

ధర్మవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు, ఆత్మీయ ట్రస్టు చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఇందులో కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, సకల చంద్రశేఖర్, సాయిగణేశ్, గడ్డం రామ్మోహన్, హరిశంకర్, వెంకట కిశోర్, ట్రస్టుసభ్యులు జశ్వంత్, ప్రణవ్ పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ధర్మవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచారని, ఆయన్ను వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నరేశ్ యనమల డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలీం రోషన్, జమీర్ జాఫర్, షబ్బీర్, ఖాదర్‌వలీ, నబీరసూల్, సాధిక్, దాదాపీర్ పాల్గొన్నారు.

క్రీడాకారిణి ఉషకు మంత్రి అభినందన


ఉషను అభినందిస్తున్న మంత్రి

ధర్మవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ధర్మవరం క్రీడాకారిణి ఉషను మంత్రి సత్యకుమార్ మంగళవారం సాయంత్రం అభినందించారు. అనంతపురంలో ఎస్ఎస్‌బీఎన్‌లో మొదటి డిగ్రీ సంవత్సరం చదువుతున్న ఉష ధర్మవరంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో కబడ్డీలో శిక్షణ పొందుతోంది. ఆమె కబడ్డీతో పాటు పరుగు పందెంలో కూడా రాణిస్తోంది. మూడు రోజుల క్రితం ఎస్కే యూనివర్సిటీ నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో , 100-4 రిలే మొదటి స్థానం సాధించి.. ఆలిండియా యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. దీంతో ఉషను మంత్రి అభినందించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై రేపు నిరసన

ధర్మవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రంశ్రీనివాసరెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక కేతిరెడ్డి క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్‌లు మేడాపురం వెంకటేశ్, కేతాలోకేశ్, రమాదేవి, గజ్జలశివ, ఓబుళమ్మ పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభలను జయప్రదం చేయండి

కదిరి అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జనవరి 5,6,7,8 తేదీల్లో నిర్వహించే యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బాలికల ఉన్నతపాఠశాలలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ చెన్నక్రిష్ణ, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మల్లికార్జున, ఆజాం బాషా, భార్గవ్, రవివర్ధన్‌రెడ్డి, రమణానాయక్ పాల్గొన్నారు.

వీధికుక్కల బెడద


నల్లమాడ ప్రధాన వీధిలో సంచరిస్తున్న వీధి కుక్కలు

నల్లమాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధాన రహదారిలో వీధి కుక్కలు బెడద ఎక్కువైంది. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కుక్కలు వెంటపడుతుండటంతో ద్విచక్రవాహనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు కిందపడి గాయపడ్డారు. అంతేకాకుండా రాత్రి 10గంటల తరువాత రోడ్లపై వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వాటి దెబ్బకు భయపడి చిన్నారులు, మహిళలు, వృద్ధులు రోడ్డుపై రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను మరో ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ రోడ్లు వేయండి

నల్లమాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురమాల, గంగాపురం, చౌటకుంటపల్లి గ్రామాల్లో వీధి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, సీసీ రోడ్లు వేసేలా చర్యలు తీసుకో వాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారినా... తమ గ్రామాల్లో వీధుల దుస్థితి మాత్రం మారడం లేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వ పాలకులైనా స్పందించి.. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయించాలని కోరుతున్నారు.


కురమాలలో సీసీ రోడ్డు లేని దృశ్యం

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

నల్లమాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోందని కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. మండలంలోని మసకవంకపల్లి, మూలప్పగారిపల్లిలో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 14 పంచాయతీలోని గ్రామాల్లో టీడీపీ నాయకుల సహకారంతో పదివేల సభ్యత్వ నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో బుట్టి నాగభూషణనాయుడు, మంజునాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ బశెట్టి నాగభూషణం, రామచంద్ర, బయ్యారెడ్డి, కిష్టప్ప, నరేంద్ర, శ్రీనివాసులు, హరీ‌ష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కదిరి: క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కందికుంట


పుట్టపర్తి: వెంగళమ్మచెరువు హోలీసిటీ చర్చిలో సంబరాలు

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. కదిరిలోని టవర్‌క్లాక్ వద్ద ఉన్న సీఅండ్ఐజీ చర్చిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కేక్ కట్ చేశారు. పుట్టపర్తి మండలంలోని వెంగళమ్మ చెరువు, పెడపల్లి, కొట్లపల్లి, నిడిమామిడి, ఎనుములపల్లి, కర్ణాటకనాగేపల్లిలోని చర్చిలన్నీ క్రైస్తవులతో కిటకిటలాడాయి. ధర్మవరంలోని టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి కేక్ కట్ చేశారు. అలాగే లక్ష్మీచెన్నకేశవపురంలోని హమాలీకాలనీ చర్చిలో 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. ముదిగుబ్బ మండలంలోని చర్చిల్లో ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అందజేసిన కేక్‌లను క్లస్టర్ తుమ్మల మనోహర్ చర్చిలకు అందజేశారు. అలాగే బత్తలపల్లి మండలంలోని అన్ని చర్చిలకు పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు కేకులు అంద జేసి... సంబరాలు నిర్వహించారు. నంబుల పూల కుంటలో చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఊరేగింపు నిర్వహించారు. ఓబుళ దేవరచెరువు, కొండకమర్ల, చౌడంపల్లి తదితర గ్రామాల్లో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తనకల్లు మండలంలోని తనకల్లు, కోర్తి కోట, రతినేనా యక్‌తండా, గేమేనా యక్‌తండా, అద్దానంపల్లి, ఎర్రచెరువుపల్లి, దేవలంతండా తదితర గ్రామాల్లో చర్చిల్లో క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నల్లమాడ మండలంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


ధర్మవరం : లక్ష్మీచెన్నకేశవపురం చర్చిలో కేక్ కట్ చేస్తున్న ప్రముఖులు


ధర్మవరం : టీడీపీ కార్యాలయంలో సంబరాలు

కప్పేసిన కంపచెట్లు

రోడ్ల పక్కన భారీగా పెరిగిన ముళ్ల పొదలు



నేలకోట - ఏలుకుంట్ల , గొల్లపల్లి నుంచి ధర్మవరానికి వెళ్లే రహదారుల పక్కన ఏపుగా పెరిగిన కంపచెట్లు

ధర్మవరంరూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లి - మల్కాపురం, నేలకోట - ఏలుకుంట్ల, గొల్లపల్లి - గుట్టకిందపల్లి రైల్వేబ్రిడ్జి కింద వరకు ఉన్న రహదారుల ఇరుప్రక్కలా కంపచెట్లు, రేణిచెట్లు భారీగా పెరిగాయి. దీంతో రోడ్డు మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించ.. అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కంపలు గీసుకుని ద్విచక్రవాహదారులు గాయపడుతున్నారు. రెండు నెలల క్రితం నేలకోట సబ్‌స్టేషన్ సమీపంలో కంపచెట్లు విపరీతంగా పెరగడంతో ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మరణించారు. రాత్రివేళాల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లును తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

ఐహెచ్‌ఆర్‌పీసీ జోనల్ అధ్యక్షురాలిగా గొర్తి భారతీదేవి



నియామక పత్రాన్ని అందుకుంటున్న గొర్తి భారతీదేవి

ధర్మవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి సౌత్ ఇండియా జోనల్ అధ్యక్షురాలిగా ధర్మవరానికి చెందిన గొర్తిభారతీదేవి ఎంపికయ్యారు. ఈ మేరకు అంతర్జాతీయ మానవ హక్కుల సమితి ఫౌండర్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎండీ ముజాయిద్ నుంచి నియామక పత్రాన్ని అనంతపురంలో బుధవారం అందుకున్నారు. గొర్తి భారతీదేవి కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి అంతర్జాతీయ మానవహక్కుల జోనల్ అధ్యక్షురాలిగా ముజాహిద్ నియమించారు. గొర్తి భారతీదేవికి ఆమె భర్త గొర్తి సుధాకర్ నాయుడు అండగా ఉండి సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షుడు ముజాయిద్‌తో పాటు నేషనల్ ప్రసిడెంట్ డాక్టర్ షేక్‌పరాష్ సోహెబ్, నేషనల్ చైర్మన్ డాక్టర్ షేక్ సుహేల్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రశాంతి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.


తాడిమర్రిలో అరటిపండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వాజ్‌పేయికి ఘన నివాళి

ధర్మవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారతరత్న, మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, బీజేపీ నాయకులు సాకే ఓబులేసు, జింకాచంద్ర, గుండా పుల్లయ్య, శ్యామరావు పాల్గొన్నారు.

- తాడిమర్రి: వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గంగులకుంట గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ప్రధాన వీధుల్లో అరటిపండ్లు పంపిణీచేశారు.
- ఓబుళదేవరచెరువు: వాజ్‌పేయి జయంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పలువురు నివాళ్లు అర్పించారు. ఇందులో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ఎంపీ హరిక్రిష్ణ, జిల్లా యువమోర్చ నాయకుడు నరేష్‌బాబు, మండలాధ్యక్షుడు సున్నంపల్లి రంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.
- కొత్తచెరువు : స్థానిక నెహ్రూ కూడలిలో వాజ్‌పేయి చిత్రపటానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాలభైరవస్వామి గ్రామోత్సవం


అలంకరణలో స్వామి

ధర్మవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాలభైరవస్వామి గ్రామోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మూడురోజుల పాటు ఆలయంలో మహా కాలభైరవాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నారు. మహాకాలభైరవాష్టమికి భైరవుడు రుద్రభైరవ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శునక వాహనంపై పుర్రెల హారాలతో ఆయుధాలు ధరించి భైరవుడు భీకరంగా దర్శనమిచ్చారు. అనంతరం కాలవ భైవర ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. రథం ముందు ఉరుములు, గురవయ్యలు చేసిన నృత్యాలు అలరించాయి.


ఊరేగింపులో నృత్యం చేస్తున్న మహిళలు

పశువులకు చికిత్స శిబిరం

నంబులపూలకుంట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనియాన్‌చెరువులో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. డీడీ సుధాకర్, గర్భకోశ వ్యాధి నిపుణుడు పివి. సుధాకర్, పశువైద్యాధికారి బాలనాయక్ పశువులకు చికిత్సలు చేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి రథోత్సవం

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓడీచెరువులో అయ్యప్పస్వామి రథోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహిం చారు. వందలాదిమంది భక్తులు, మాలధారులు ఇందులో పాల్గొ న్నారు. మొదట మండలంలోని ఎం. కొత్తపల్లి అయ్యప్ప ఆలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన రథాన్ని ప్రారంభించారు. ఈ రథాన్ని ఎం. కొత్తపల్లి, వడ్డివారిపిల్లి, ఓడీచెరువు పురవీధుల గుండా పోలీస్ స్టేషన్‌వరకు లాగారు. ఆర్డీఓ సువర్ణ.. స్వామివారికి పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం అయ్యప్ప సన్నిధిలో వందలాది మంది భక్తులకు, మాలధారులకు అన్నసంతర్పణం చేశారు. కార్యక్రమంలో ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయుల నాయుడు, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల రెడ్డి, పిట్టా ప్రభాకర్‌రెడ్డి, నిజాం, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.


అయ్యప్ప స్వామి రథం లాగుతున్న భక్తులు, స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆర్డీఓ సువర్ణ (ఇన్‌సెట్లో..)

క్రైం న్యూస్..

ఆటోలు ఢీ.. ఆరుగురికి గాయాలు

బత్తలపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో బుధవారం రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఆరు గాయపడ్డారు. మామిళ్లపల్లి నుంచి ముదిగుబ్బ మండలం ఓబిమిచెర్లోపల్లికి ఓ ఆటో బయలు దేరింది. తాడిమర్రి మండలం నిడిగల్లు నుంచి ధర్మవరానికి మరో ఆటో బయలుదేరింది. ఈ రెండు ఆటోలు బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మామిళ్లపల్లికు బాలరాజు, శ్రావ ని, ధర్మవరానికి చెందిన దుగ్గేన్న, యమున, నిడిగల్లుకు చెందిన ఆటో డ్రైవర్ శోలెంద్రబాబు, సంతోష్ గాయపడ్డారు. వీరిని స్థానికులు ప్రైవేటు అంబులెన్స్‌లో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

జూదరుల అరెస్టు

తనకల్లు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిరెడ్డిపల్లి సమీపంలో.. కర్ణాటకలోని చాకివేలు సరిహద్దులో బుధవారం జూదమాడుతున్న 12 మందిని పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. వారి వద్దనుంచి రూ.56,146 నగదు, 12 ద్విచక్రవాహనాలు, 12 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదుచేశామని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్


స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

బత్తలపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు సీజ్ చేసినట్లు ఏఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. వాటితో పాటు ఒక టిప్పర్, ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకొని.. స్టేషన్‌కు తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని అన్నారు.

ఆరుగురిపై కేసు

కదిరి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక హారూన్ వీధిలో ఉండే కాలేషా, మస్తాన్, అసలాం, మరో ముగ్గురు మంగళవారం అదే వీధిలో తనపై దాడి చేసి.. గాయపర్చినట్లు స్థానిక దేవానంద్ కాలనీ వాసి రవిశేఖర్‌ప్రసాద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

కులం పేరుతో దూషించాడని..

కదిరి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కూరగాయ మార్కెట్ వద్ద గౌస్ అనే వ్యక్తి తనను కులం పేరుతో దూషించాడని కూరగాయాలు వ్యాపారి కామాక్షిని పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. కామాక్షి గౌస్‌కు రూ.1,950 ఇవ్వాల్సి ఉంది. దీంతో అతను ఆమె తోపుడు బండిని తీసుకున్నారు. బండి తిరిగి ఇవ్వాలని అడినందుకు తనను కులం పేరుతో దూషించాడని కామాక్షి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

సచివాలయంలో చోరీ

ధర్మవరంరూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల సచివాలయంలో ఫైబర్‌నెట్‌కు సంబంధించి రెండు బ్యాటరీలు, ఒక ఇన్వర్టర్ చోరీ అయినట్లు సచివాలయ సెక్రటరీ చంద్ర రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 24న ఏపీ ఫైబర్‌నెట్‌కు సంబంధించి టెక్నీషియన్ సచివాలయానికి వచ్చి బ్యాటరీలను తనిఖీ చేయగా... అందులో రెండు బ్యాటరీలు, ఇన్వర్టర్ లేనట్లు గుర్తించారు. దీంతో గ్రామంలో గాలించినా.. ఎక్కడ దొరకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇస్కాన్ నగర సంకీర్తన


ధర్మవరంలో ఇస్కాన్ భక్తుల సంకీర్తన

ధర్మవరంరూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరం నుంచి శివానగర్, పరమేశ్వరి ఫంక్షన్‌హాల్ మీదుగా కదిరిగేటు, బ్రహ్మంగారి గుడి, రామాలయం వరకు ఇస్కాన్ భక్తులు బుధవారం నగరసంకీర్తన చేపట్టారు. వీధుల్లో తిరుగుతూ హరినామ సంకీర్తనలు ఆలపించారు. కలియుగంలో ప్రతి ఒక్కరూ రోజుకు ఒక్కసారైనా హరేకృష్ణ.హరేరామ సంకీర్తన చేసుకోవడం ద్వారా ముక్తిమార్గం కలుగుతుందని ధర్మవరం ఇస్కాన్ ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాధవ దాస్ తెలిపారు.

అన్నమయ్య విగ్రహానికి అపచారంపై నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులు

ధర్మవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కొందరు ఆకతాయిలు మంగళవారం అన్నమయ్య విగ్రహానికి శాంతాక్లాజ్ టోపీ పెట్టి అపచారం చేశారని, హిందువుల మనోభావాలను దెబ్బ తీశారని అన్నమయ్య సేవా మండలి బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ మండల అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య, విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు పులిచెర్లవేణుగోపాల్ ఆధ్వర్యం లో స్థానిక అన్నమయ్య విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు కలవల రాంకుమార్, మారుతి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కదిరి అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయరత్న అవార్డు గ్రహీత రవినాయక్‌ను బంజార ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. విద్యాభివృద్ధికి రవినాయక్ చేస్తున్న సేవలకు గాను ఆయనకు ఉపాధ్యాయ రత్న అవార్డు రావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో చక్రీనాయక్, గణేనాయక్, శ్రీరాములనాయక్, శంకర్‌నాయక్, దశర్థనాయక్, ఆనంద్‌నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

పరిగి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సృష్టికర్త స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహ ఏర్పాటుపై బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రజల గుండెల్లో గుర్తింపు పొందిన మహనీయుడు నందమూరి తారకరామారావు అన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని పరిగిలో ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ, మారుతి, వడ్డె హనుమయ్య, ఈశ్వరప్ప, మోదకుమార్, మాజీ వైస్ ఎంపీపీ నరసింహప్ప, ఆనంద్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మండలపూజ



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

పెనుకొండ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం మండల పూజ కార్యక్రమాన్ని గురుస్వామి మోహన్ ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6గంటలకు కలశస్థాపన, 9గంటలకు శ్రీధర్‌స్వామి, గుప్తాస్వామి ఆధ్వర్యంలో హోమాలు, మధ్యాహ్నం 12గంటలకు భజన కార్యక్రమాలు ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం జరిగాయి. సాయంత్రం7గంటలకు స్వామివారిని బంగారు రథంపై ఉంచి మేళతాళాలతో వాయిద్యాలతో భక్తుల భజనలతో బాణసంచా పేల్చి గ్రామోత్సవం నిర్వహిచారు. అశేష సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. 9.30గంటలకు పడిపూజ, హరివరాసనం కార్యక్రమం నిర్వహించారు.

అయ్యప్పలకు భిక్ష

పరిగి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మాలధారులకు బుధవారం అయ్యప్ప స్వామి దేవాలయంలో జమేదార్ శ్రీనివాసులు, సరస్వతి దంపతుల కుమారుడు నాగచైతన్య జన్మదినం సందర్భంగా దాదాపు 300మందికిపైగా అయ్యప్ప మాలదారులకు అన్నదానం చేశారు. పోలీస్ సిబ్బందితో సహా ఎస్ఐ రంగడు అన్నదానంలో పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్, జమేదార్ రామిరెడ్డి, కానిస్టేబుల్ ధనుంజయ్, గురుస్వామి నరసింహప్ప, లింగారెడ్డి, కన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ

రొళ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా వీరాంజనేయులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతి జిల్లా కేవీపీపురం స్టేషన్ నుండి రొళ్ల స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. ప్రజలు తమకు సహకారం అందించాలని కోరారు. ఈసందర్భంగా సిబ్బంది నూతన ఎస్ఐకి స్వాగతం పలికారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

మడకశిరటౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 99వ జయంతి వేడుకలను బుధవారం పట్టణంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. దేశ అభివృద్ధి కోసం ఆయన ఎంతగానో కృషి చేశారని, ఆయన చేసిన సేవలను వారు స్మరించుకొన్నారు. ఆయన దూరదృష్టితోనే రవాణా రంగంలో దేశం సర్వతో ముఖాభివృద్ధి చెందిందని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, నాయకులు దొడ్డరంగే గౌడ్, సుబ్బారాయుడు, నారాయణప్ప, మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గోరంట్లలో..

గోరంట్ల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని బుధవారం గోరంట్లలో బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్ నాయకత్వంలో గోరంట్లలోని పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. శతజయంతి, సుపరిపాలన, దివస్‌లో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో బిజేపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, నాగరాజుయాదవ్, వెంకటాచలం, లక్ష్మీదేవమ్మ, అశోక్, శంకర్ తదితరులున్నారు.

పరిగిలో వ్యాసరచన పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో పరిగి వేణుగోపాలరావు

పరిగి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా బుధవారం విద్యానిధి కళాశాలలో మండల బీజేపీ సభ్యత్వ నమోదు నాయకుడు పరిగి వేణుగోపాల్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి ఖ్యాతి తీసుకొచ్చిన అటువంటి మహానుభావుడు భారతదేశంలో జన్మించడం గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు అశ్వర్థ, భగత్‌సింగ్ సేవాసమితి అధ్యక్షులు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్‌లో..

పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం వాజ్‌పేయి జయంతి వేడుకలో ఘనంగా జరుపుకున్నారు. చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎనుమల రామక్రిష్ణ, డా.గోపీనాథ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఊరూవాడా ఘనంగా

క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ పండగను పురస్కరించుకుని బుధవారం వాడవాడలా వేడుకలు జరుపుకున్నారు. పెనుకొండ పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఫాస్టర్ ఫ్రాన్సెస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ ఎంతగానో ఆకట్టుకుంది. పట్టణంలోని నాగులకట్ట వీధిలో ఉన్న జిప్సి హాస్టల్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు సభ్యుడు డా.గోపీనాథ్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. లేపాక్షి, సోమందేపల్లి మండలాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మడకశిరలోని సీఎంఅండ్ఐజీ చర్చితోపాటు పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అమరాపురం బెరకా మందిరంలో, సాలెం ప్రార్థనా మందిరంలోనూ, గుడిబండ, ఫళారం గ్రామాల్లోనూ, పావగడ, వై.ఎన్.హొసకోట, నీలంపల్లి చర్చిలలో కీర్తనలను ఆలపించారు.



పెనుకొండచర్చిలో కేక్‌కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు



ప్రసంగిస్తున్న పాస్టర్ ఫ్రాన్సెస్



లేపాక్షిలో..



ప్రార్థనలకు హాజరైన సభ్యులు



చీరలు పంపిణీ చేస్తున్న బీజేపీ సభ్యత్వ నమోదు ప్రతినిధి గోపీనాథ్



అమరాపురంలో..



పావగడలో....



మడకశిరలో ప్రసంగిస్తున్న పాస్టర్

భారీ వాహనాలతో దెబ్బతింటున్న రహదారులు

మడకశిరటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలకుల నిర్వాకం నేటికీ శాపంగా మారుతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో మడకశిర పట్టణాన్ని నేషనల్ హైవేకు కలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రింగ్‌రోడ్డు నిర్మాణానికి పచ్చజెండా ఊపారు. అందులో భాగంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి రింగ్‌రోడ్డు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి సమస్య తీసుకెళ్లగా దాదాపు రూ.42కోట్లతో మంజూరు చేస్తూ అందుకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేయించి, భూములు సేకరించేందుకు అనుమతులు ఇచ్చారు. అప్పట్లో అధికారులు సర్వే నిర్వహించి పావగడ రోడ్డు నుండి చౌటిపల్లి, చీపులేటి మీదుగా నేషనల్ హైవేకు కలుపుతూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వం మారడంతో వైసీపీ పాలకులు దీనిని పెడచెవిన పెట్టడంతో రింగ్‌రోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. దీంతో సిమెంటు లారీలతోపాటు ఇతరత్రా భారీ వాహనాలు మడకశిర పట్టణంలోపల నుంచి వెళ్లాల్సిన పరిస్థితి రావడంతో రోడ్లు దెబ్బతినడంతోపాటు పట్టణ వాసులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల తారురోడ్లు సైతం పూర్తిగా దెబ్బతింటున్నాయని పట్టణ వాసులు అంటున్నారు. దీంతోపాటు గురువారం మార్కెట్ జరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. అదేవిధంగా ప్రతి రోజు కొంత మేరకు పావగడ రోడ్డు నుండి మధుగిరి రోడ్డు బెంగళూరు, శిరా, తుమకూరు తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రింగ్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి భారీ వాహనాలను హైవేకు మళ్లించాలని కోరుతున్నారు.



భారీ వాహన రాకపోకలతో దెబ్బతిన్న రహదారి

బస్సు డ్రైవర్‌కు ఫిట్స్.. త్రుటిలో తప్పిన ప్రమాదం



బస్సు చక్రాల కింద ఇరుక్కున్న ద్విచక్రవాహనం

మడకశిరటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక కేఎస్ఆర్‌టీసీ బస్సు పావగడ నుండి బెంగళూరుకు వెళుతున్న సమయంలో బుధవారం పట్టణంలోని మారుతీనగర్ సమీపంలో డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. బస్సు అదుపుతప్పి పక్కనే ద్విచక్ర వాహనంలో వెళుతున్న గౌడనహళ్లి గ్రామానికి చెందిన నారాయణప్పను, పక్కనే మరో ఆటోను ఢీకొని ఆగిపోయింది. దీంతో నారాయణప్పకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని మడకశిరఆస్పత్రికి, అక్కడినుంచి హిందూపురం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్‌ను మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పక్కనే ఉన్న ఆటోను బస్సు బలంగా ఢీకొనడంతో ఆటో పల్టీకొట్టింది. పెద్ద ప్రమాదం జరగకపోవడంతో జనం ఊపిరి పీల్చుకొన్నారు.

ఏరులై పారుతున్న అక్రమ మద్యం

లేపాక్షి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టెండర్ల ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసింది. లేపాక్షిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం పరిధిలో దుకాణదారులు విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్ట్‌షాపులను ఏర్పాటుచేశారు. కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ సిబ్బంది పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెల్ట్‌షాపు నిర్వహిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని పలుమార్లు హెచ్చరించినా ఆయన హెచ్చరికలను దుకాణదారులు బేఖాతరు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ రెండు మూడు బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. అంతేకాక స్థానికంగా మద్యం దుకాణంలో ఎమ్మార్పీ ధరకంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన సిబ్బంది ఇవేమి పట్టించుకోవడం లేదని మందు బాబులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్ దుకాణాలను రద్దుచేసి ఎమ్మార్పీ ధరకే మద్యం అమ్మేలా చూడాలని కోరుతున్నారు.

బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు : ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య

ఎక్కడైనా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో పోలీసులతో గస్తీ నిర్వహిస్తున్నాం. ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు జరపాలని దుకాణదారులకు తెలియజేశాము.

డ్రైవర్లను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోండి

పెనుకొండ రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపల్లి సమీపంలో వెంకటగిరిపాళ్యంకు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన మిల్లర్ కంకర తరలించే టిప్పర్ల డ్రైవర్లను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బెదిరిస్తున్నారని కంపెనీ నిర్వాహకులు మంగళవారం రాత్రి కియ పోలీసులకు, జిల్లా ఎస్పీ రత్నకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి గ్రీన్ కంపెనీ ఆర్ఎంసీ మిక్సర్ ప్లాంట్‌కు అవసరమయ్యే కంకరను టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి సమయంలో కొందరు టిప్పర్ డ్రైవర్లను బెదిరించి కంకర తరలించకూడదని బెదిరించారు. దీంతో వారిపై చర్యలు తీసుకోవాలని కియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం పెనుకొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ వెంకటరమణ అక్కడికి వెళ్లి గ్రీన్‌టెక్ కంపెనీముందు బందోబస్తు నిర్వహించారు. బెదిరింపులకు పాల్పడిన వారిపై ఆరాతీస్తున్నట్లు తెలిసింది.



కాంక్రీట్ మిక్సర్ వద్ద పోలీసుల బందోబస్తు

ఏవి కావాలంటే అవి..!

- పాఠశాలలకు క్రీడాసామగ్రి
- విద్యార్థులకు ఎంచుకునే స్వేచ్ఛ
- రూ.7 వేల నుంచి రూ.30 వేల వరకూ..
- పాఠశాలల నుంచి విద్యాశాఖకు ఇండెంట్
- కూటమి ప్రభుత్వ విధానంపై హర్షాతిరేకాలు



కొనకొండ్ల జడ్పీ హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు

అనంతపురం విద్య, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు సరికొత్తగా క్రీడా సామగ్రిని అందనున్నాయి. గతంలో అన్ని పాఠశాలలకు ఒకే తరహా మెటీరియల్ ఇచ్చేవారు. పాలకులకు నచ్చినవే ఇచ్చేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఎవరికి కావాల్సిన పరికరాలను వాళ్లే ఎంచుకునే స్వేచ్ఛను ఇచ్చింది. ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు అవసరమైన పరికరాల వివరాలతో ఇండెంట్ పంపితే.. ఆ మేరకు సరఫరా చేయనున్నారు. ప్రాథమిక పాఠశాలకు రూ.7 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.14 వేలు, ఉన్నత పాఠశాలకు రూ.30 వేల విలువైన పరికరాలను అందించనున్నారు. అన్ని పాఠశాలల నుంచి ఇండెంట్ తీసుకుంటున్నారు.

55 రకాల సామగ్రి

విద్యార్థులకు కొత్తగా 55 క్రీడా సామగ్రి ఇవ్వనున్నారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, బేస్ బాల్, బాక్సింగ్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫెన్సింగ్, పుట్‌బాల్, హ్యాండ్ బాల్, హాకీ, కబడ్డీ, రగ్బీ, రోప్ స్కిప్పింగ్, సాఫ్ట్‌బాల్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్, త్రోబాల్, యోగా, వాలీబాల్ తదితర క్రీడలకు ఆటవస్తువులు, సామగ్రిని ఇస్తున్నారు. కనిష్ఠ ధర ధర రూ.90 నుంచి గరిష్ఠంగా రూ.12 వేల విలువైన వస్తువులకు జాబితాలో చోటు కల్పించారు. ఆర్చరీ ఆరోస్ రూ.90, ఆర్చరీ బౌ రూ.6000, ఆర్చరీ టార్గెట్ రూ.4500, అథ్లెటిక్స్ 50 మీటర్ల టేప్ రూ.850, బ్యాడ్మింటన్ కాక్స్ 120, బ్యాడ్మింటన్ నెట్ రూ.500, బ్యాడ్మింటన్ షెటిల్ రాకెట్లు రూ.1500, వాలీ బాల్ నెట్ రూ.1600, వాలీబాల్స్ రూ.1250, బాక్సింగ్ గ్లోవ్స్ రూ.850, క్యారంబోర్డు సెట్ రూ.650, చెస్‌సెట్ రూ.450, క్రికెట్ బ్యాట్స్ రూ.1500, ఫెన్సింగ్ గ్లోవ్స్ రూ.1000, ఫెన్సింగ్ మాక్స్ రూ.4 వేలు, హాకీ బాల్స్ రూ.120, హాకీ స్టిక్స్ రూ.650, రగ్బీ బాల్స్ రూ.900, టేబుల్ టెన్నిస్ టేబుల్ రూ.12,000 ఇలా.. పలురకాల విలువైన పరికరాలను అందించనున్నారు.

పాఠశాల స్థాయిని బట్టి

కొత్త క్రీడా పాలసీ ప్రకారం పాఠశాల స్థాయినిబట్టి క్రీడా పరికరాలను అందించనున్నారు. విద్యార్థుల క్రీడా అవసరాలు, ఆసక్తి మేరకు పరికరాలు సరఫరా చేయాలని విద్యాశాఖకు పాఠశాలల నుంచి ఇండెంట్ పంపాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన బడ్జెట్ పరిమితికి మించకుండా తమకు కావాల్సిన క్రీడా వస్తువులను ఎంచుకోవచ్చు. 'సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యామిత్ర' యాప్ ద్వారా ఇప్పటికే పాఠశాలలనుంచి ఇండెంట్ పంపుతున్నారు. త్వరలోనే పరికరాలను సరఫరా చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమౌతోంది.

మంచి పరిణామం..



ప్రభుత్వం కొత్త క్రీడా పాలసీ అమలు చేయడంలో భాగంగా స్కూళ్లకు స్పోర్ట్స్ మెటీరియల్ అందించడం ఆనందంగా ఉంది. గతంలో వాళ్లు అనుకున్నవి ఇచ్చేవారు. కొత్త ప్రభుత్వం రూ.7 వేల నుంచి రూ.30 వేల వరకూ మెటీరియల్ ఇస్తోంది. విద్యార్థులు కోరిన ఆట వస్తువులు, పరికరాలను ఇవ్వడం శుభపరిణామం. దేశంలో ఎక్కడా లేని విధంగా క్రీడా సామగ్రిని ఇస్తున్నారు. విద్యార్థుల్లో ఆనందం కనిపిస్తోంది.

- అక్కులప్ప, ఏపీ పీఈటీ అండ్ ఎస్ఏపీఈ జిల్లా అధ్యక్షుడు

క్రీడల అభివృద్ధికి ఊతం..

పాఠశాల విద్యార్థులకు ఇకపై స్పోర్ట్స్ మెటీరియల్ కొరత ఉండదు. గతంలో ఈ సమస్య చాలా స్కూళ్లలో ఉండేది. పిల్లల కోసం కొందరు పీడీలు సొంత డబ్బుతో పరికరాలను కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ప్రభుత్వమే సమకూరుస్తోంది. ఇది మంచి ఆలోచన. పిల్లలు ఆటల వైపు మరింత ఆసక్తి చూపుతారు. ప్రభుత్వ నిర్ణయం క్రీడల అభివృద్ధికి దోహదం చేస్తుంది.

- అనిత, స్కూల్ అసిస్టెంట్ పీడీ, పూలకుర్తి జడ్పీ హైస్కూల్

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

మడకశిర టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి సన్నిధిలో 11వ వార్షికోత్సవంలో భాగంగా మండల పూజ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచే పుణ్యాహవాచనం, గణపతి పూజ, నాంది, నవగ్రహారాధన, కలశస్థాపన, గణపతి హోమాలు, లక్ష్మీ హోమాదులు, అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు నెయ్యాభిషేకం, పూర్ణాహుతి, కలశ విసర్జన, కన్నెస్వాములచే జ్యోతిపూజ, గురుపూజ, అయ్యప్పస్వామి భజన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు న్యాయవాది రాధాకృష్ణ, కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలధారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా గొల్లపల్లి రిజర్వాయర్



కృష్ణాజలాలతో కళకళలాడుతున్న గొల్లపల్లి రిజర్వాయర్

పెనుకొండ రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజలాల నీరు చేరడంతో రిజర్వాయర్ నీటితో నిండుకుండలా మారింది. రిజర్వాయర్ నీటి సామర్థ్యం 1.913 టీఎంసీ కాగా ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.75టీఎంసీల నీరు నిలువ ఉంది. సెప్టెంబరు, అక్టోబరు నెలలో గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీరు విడుదల చేశారు. తాజాగా వారం రోజుల నుంచి రోజూ జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవాకు 90క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో రిజర్వాయర్‌లో నీరు తునికిసలాడుతోంది.

డివైడర్‌ను ఢీకొన్న కారు - ఒకరికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం వై జంక్షన్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబరీష్ అనే యువకుడు గాయపడ్డాడు. కియా పోలీసులు అందించిన వివరాల మేరకు కారు హరిపురం వై జంక్షన్ వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొందన్నారు. దీంతో కారు ఎగిరి అవతల రోడ్డుపై బోల్తాపడింది. డ్రైవర్‌ను స్థానికులు హుటాహుటిన 108సాయంతో ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది.